పోలీసు అమరులకు వందనం



పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవంలో భాగంగా స్థానిక ఏఆర్ హెడ్ క్వార్టర్‌లో సోమవారం ఫ్లాగ్‌డే(స్మృతిపరేడ్) నిర్వహించారు. అమరవీరుల స్తూపం వద్ద జిల్లా ప్రధాన న్యాయమూర్తి ప్రభాకర్‌రావు, ఎమ్మెల్యేలు పాయల్ శంకర్, అనిల్ జాదవ్, కలెక్టర్ రాజర్షిషా, రెండో బెటాలియన్ కమాండెంట్ నితికా పంత్, ఎస్పీ గౌష్‌ఆలం, డీఎంహెచ్‌ఓ కృష్ణ నివాళులు అర్పించారు.

- న్యూస్‌టుడే ఆదిలాబాద్ నేర విభాగం

ఆర్టీసీ బస్టాండ్‌లో ప్రైవేటు వాహనాలు



ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో నో పార్కింగ్ బోర్డు ఎదుటే నిలిపి ఉంచిన ద్విచక్రవాహనాలు

జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో ప్రైవేటు వాహనాలను అడ్డదిడ్డంగా నిలుపుతున్నారు. పార్కింగ్ షెడ్డులో తప్ప బస్టాండ్ ఆవరణలో వాహనాలు నిలపవద్దని, నిబంధనలు పాటించని ద్విచక్రవాహనదారులకు రూ. 500 జరిమానా విధిస్తామని అధికారులు సూచికలు ఏర్పాటు చేశారు. అయినా బస్టాండ్ ఆవరణలో వాహనాలను నిలపడంతో ట్రాఫిక్ సమస్యలు ఎదురవుతున్నాయని అధికారులు, ప్రయాణికులు తెలుపుతున్నారు.

- ఈనాడు ఆదిలాబాద్- న్యూస్‌టుడే ఆదిలాబాద్ అర్బన్


సివిల్ సర్వీస్ శిక్షణార్థులకు స్వాగతం పలుకుతున్న పొన్నారి గ్రామస్థులు, అధికారులు

పరిసరాలు పరిశీలించి.. పథకాల అమలుపై ఆరా తీస్తూ..

తాంసి, న్యూస్‌టుడే: జిల్లాలో అమలు చేస్తున్న వివిధ అభివృద్ధి సంక్షేమ పథకాలను అధ్యయనం చేయడానికి డా.మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో సివిల్ సర్వీసెస్ ప్రొబేషనరీ అధికారులు సోమవారం తాంసి మండలం పొన్నారి గ్రామాన్ని సందర్శించారు. ఎంపీడీవో మోహన్‌రెడ్డి, తహసీల్దార్ లక్ష్మి గ్రామస్థులతో కలిసి వారికి స్వాగతం పలికారు. అధికారులు పలబీస్ మీనా, పూజకుమారి, ప్రశాంత్, అమర్‌జీత్ కుమార్, విశ్వదీప్ మయ, సుబీ చౌహాన్ గ్రామ పరిసరాలను పరిశీలించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గ్రామంలో అమలు చేస్తున్న సంక్షేమ పథకాల అమలు తీరుపై ఆరా తీశారు. గ్రామస్థులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు.

అవినీతి మత్తు.. ఆదాయం చిత్తు

● ఆబ్కారీ అధికారుల వసూళ్ల పర్వం

ఈటీవీ ఆదిలాబాద్

◆ బేల మండలంలోని ఓ గ్రామంలో ఇటీవల గ్రామాభివృద్ధి కమిటీ (వీడీసీ) మద్యం గొలుసు దుకాణం కోసం వేలం నిర్వహించింది. ఏడాదికి రూ. 12 లక్షలతో ఓ వ్యక్తికి దుకాణం దక్కింది. ఈ విషయం తెలిసిన ఓ ఆబ్కారీ అధికారి అక్కడికి వెళ్లారు. తనకు ఏడాదికి రూ.2 లక్షలు ఇవ్వాలని షరతు పెడితే గ్రామస్థులు అంగీకరించలేదు. చివరికి ఆదిలాబాద్‌లోని మద్యం సిండికేట్‌కు చెందిన ఓ ప్రముఖుడి వద్దకు వెళ్లటంతో నెలకు రూ.3 వేల చొప్పున ఏడాదికి రూ.36 వేలు అధికారికి ఇచ్చేలా ఒప్పందం కుదిరింది.


ఇది బోథ్ మండలంలోని ఓ మద్యం గొలుసు దుకాణం. ఇంద్రవెల్లి, ఇచ్చోడ, సిరికొండ మండలాల్లో కొంతమంది అధికారుల కనుసన్నల్లో గొలుసుకట్టు దుకాణాల నిర్వహణ సాగుతోంది. డబ్బులు ఇవ్వటం ఆలస్యమైతే గుడుంబా, గంజాయి కేసులు నమోదు చేస్తామని భయపెడుతున్నారనే ఆరోపణలున్నాయి. ఒకటి, రెండుసార్లు ఉన్నతాధికారుల దృష్టికి వెళ్లినా స్పందన లేదు.



	ఆదిలాబాద్	నిర్మల్	ఆసిఫాబాద్	మంచిర్యాల
మద్యం దుకాణాలు	40	47	32	73
బార్‌అండ్‌రెస్టారెంట్లు	09	08	03	16

ఉమ్మడి జిల్లాలో 192 మద్యం దుకాణాలతోపాటు మరో 36 బార్ అండ్ రెస్టారెంట్లకు ప్రభుత్వ అనుమతి ఉంది. 12 మున్సిపాలిటీల పరిధిలో అనుమతులున్న దుకాణాలు, బార్ అండ్ రెస్టారెంట్లను మినహాయిస్తే 1,519 పంచాయతీల పరిధిలో అక్రమ మద్యం దుకాణాలను అధికారులు ఆదాయ వనరులుగా మార్చుకుంటున్నారు. గ్రామానికి ఒక్కో గొలుసుకట్టు దుకాణం ద్వారా సగటున నెలకు రూ.5 వేల చొప్పున పరిగణనలోకి తీసుకుంటే నెలకు రూ.75.95 లక్షలు, రెండు దుకాణాలను పరిగణనలోకి తీసుకుంటే రూ.1.50 కోట్లు అక్రమ వసూళ్ల లక్ష్యంగా అధికారుల దందా సాగుతోంది. కింది స్థాయి అధికారులు చేసే దందా ఉన్నతాధికారులకు తెలిసే జరుగుతుందనే ఆరోపణలున్నాయి.

నిర్మల్ జిల్లా బేల్‌తరోడ అంతర్రాష్ట్ర చెక్‌పోస్టు మహారాష్ట్ర నుంచి వచ్చే అక్రమ మద్యం సరఫరాకు వారధిగా నిలుస్తోంది. మహారాష్ట్రలో ఎన్నికలు ఉన్నందున మన మద్యాన్ని అక్కడికి పంపిస్తూ అక్కడి చౌక మద్యాన్ని మనకు చేరవేసే దందా సాగుతోంది. కొంతమంది ఎంపీఐ అధికారులైతే రాష్ట్రంలోని ఒకరిద్దరు ప్రముఖ నేతల మద్దతు ఉందని చెబుతూ మహారాష్ట్రలోని బోకర్, పాలజ్, ధర్మాబాద్ మీదుగా అడ్డదారులు చూపుతున్నారు. ఫలితంగా మహారాష్ట్ర మద్యంతో మన రాష్ట్ర ఆదాయానికి గండిపడుతుండగా, వ్యక్తిగతంగా ఎంపీఐ, ఆబ్కారీ అధికారులకు ఆదాయం చేకూరుతోంది.



ఇది మంచిర్యాల జిల్లా కోటపల్లి పోలీసులు పట్టుకున్న రూ.3 లక్షలు విలువ చేసే అక్రమంగా రవాణా చేస్తున్న మద్యం. ఓ బొలెరో, మరో ఆటోలో మహారాష్ట్రకు తరలిస్తుండగా పారుపెల్లి సమీపంలో పోలీసులు సీజ్ చేశారు. అకీరా, ఆసరవెల్లి, మొట్లగూడెం, కోటపల్లి, వేమనపల్లి మీదుగా మద్యం అక్రమ రవాణా జోరుగా సాగుతోంది. కొంతమంది ఆబ్కారీ అధికారులు వ్యక్తిగత లాభాపేక్షతో పని చేస్తుండటం అక్రమాలకు తావిస్తోంది.



అనారోగ్యం.. కొనితెచ్చుకోవాల్సిందేనా?



- క్యాన్సర్ కారక, ప్రమాదకర రసాయనాలతో స్వీట్ల తయారీ
- హోటళ్లు, మిఠాయి దుకాణాల తీరిది



ఆదిలాబాద్ వైద్య విభాగం, న్యూస్‌టుడే

అప్పుడప్పుడూ రుచికరమైన భోజనం చేద్దామని కుటుంబంతోసహా హోటల్‌కు వెళ్తుంటాం. సంతోష సమయాల్లో, శుభ కార్యాలప్పుడు మిఠాయిలు కొనుగోలు చేస్తుంటాం. ఆయా హోటళ్ల నిర్వాహకులు నిబంధనలు పాటించకపోవడంతో ప్రజల ప్రాణాలు గాలిలో దీపంలా మారుతున్నాయి.


మిఠాయిలో ఈగ

రోడ్డు పక్కనున్న చిన్న చిన్న కొట్లతోపాటు మంచి పేరున్న హోటళ్లు, మిఠాయి దుకాణాదారులు సైతం ధనార్జనే ధ్యేయంగా క్యాన్సర్‌కారక, గడువు మీరిన రసాయనాలు కలుపుతూ స్వీట్లను తయారు చేసి విక్రయిస్తున్నారు. కుళ్లిపోయిన మాంసంతో ఆహార పదార్థాలు తయారు చేస్తున్నారు.

ఎక్కడా లేనంతగా..

ఆదిలాబాద్ పట్టణంలో రాష్ట్ర టాస్క్‌ఫోర్సు బృందం బాధ్యురాలు జోనల్ అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ వి. జ్యోతిర్మయి నేతృత్వంలో ఆదివారం లక్ష్మీనరసింహ ఫ్యామిలీ రెస్టారెంట్(నాయుడు కుండ బిర్యానీ), ఢిల్లీ వాలా స్వీట్ హౌజ్, లోటస్ గ్రాండ్ ఫ్యామిలీ రెస్టారెంట్, వెంకటేశ్వర స్వీట్ హౌజ్‌లను తనిఖీ చేశారు. వాటిలో కుళ్లిన మాంసం, బూజుపట్టిన మసాలాలు, క్యాన్సర్ కారక నిషేధిత రసాయనాలు, రంగులు కలుపుతున్నట్లు గుర్తించారు. రాష్ట్రంలో ఏ జిల్లాలోనూ లేని విధంగా ఆదిలాబాద్‌లో అత్యంత కలుషిత, కల్తీ ఆహార పదార్థాలు విక్రయిస్తున్నట్లు గుర్తించామని ఆమె పేర్కొన్నారు. వారికి నోటీసులు జారీ చేశారు.

తనిఖీలు లేకపోవటమే కారణం

◆ ఆదిలాబాద్ పట్టణంలో 20 రెస్టారెంట్లు, మరో వందకుపైగా వివిధ రకాల ఆహార పదార్థాలు, మిఠాయి దుకాణాలున్నాయి. జిల్లాలోని ఇతర ప్రాంతాల్లో ఉన్నవి అదనం.

◆ ఆహారభద్రతా అధికారులు, పురపాలక సంఘం పరిధిలోని అధికారులు తరచూ హోటళ్లు, మిఠాయి దుకాణాలను తనిఖీ చేయాల్సి ఉంటుంది. కానీ వారు 'మామూలు'గా తీసుకొని మమ అనిపిస్తుండటంతో ఎక్కడ చూసినా కల్తీ రాజ్యమేలుతోంది.

◆ ఆహార భద్రతా జిల్లా అధికారులు గతేడాది పన్నెండు చోట్ల తనిఖీలు చేసినట్లు రికార్డులున్నాయి. ఈ ఏడాది ఒక్క తనిఖీ కూడా చేయలేదు.


ఇది కుళ్లిపోయిన మాంసం. ఆదిలాబాద్ పట్టణంలోని ఓ హోటల్‌లో అధికారులు దీన్ని గుర్తించారు. వినియోగదారులకు దీంతో బిర్యానీ తదితర వంటకాలు చేసి పెడుతున్నారు. దుర్వాసన రాకుండా వెనీగర్‌తో కడిగి బూజు పట్టిన మసాలాలు కలిపి వేయించి వేడిగా అందిస్తున్నారు.


పట్టణంలోని మిఠాయి దుకాణంలో లడ్డూలు తయారు చేస్తున్న చిత్రం ఇది. చెమటమయంగా ఉన్న కార్మికులు వాటిని తయారు చేస్తున్నారు. క్యాన్సర్‌కారక నిషేధిత రసాయనాలు, రంగులు కలుపుతున్నారు. వీటిని తిన్న వారికి వ్యాధులు రావటం ఖాయమని అధికారులు పేర్కొంటున్నారు.

సారు లేని బడి.. చదువెలా సాగాలి మరి!



నేరడిపల్లెలో మూసి ఉన్న ప్రభుత్వ గిరిజన ప్రాథమిక పాఠశాల వద్ద విద్యార్థులు

బోథ్ మండలం చింతగూడ పంచాయతీ పరిధి నేరడిపల్లెలోని ప్రభుత్వ గిరిజన ప్రాథమిక పాఠశాలలో ఆరుగురు విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. ఆగస్టు 20వ తేదీన ఈ పాఠశాలలో విధులు నిర్వహించిన ఉపాధ్యాయుడు వేరే పాఠశాలకు బదిలీ అయ్యారు. అప్పటి నుంచి ఈ పాఠశాలలో ఉపాధ్యాయుడే లేరు. కనీసం సీఆర్‌టీని సైతం కేటాయించని పరిస్థితి. దీంతో ఆదివాసీ విద్యార్థులు చదువుకు దూరంగా ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. ఉన్నతాధికారులు స్పందించి పాఠశాలకు ఉపాధ్యాయుడిని కేటాయించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

- న్యూస్‌టుడే, బోథ్

పత్తి కొనుగోళ్లు 25కు వాయిదా

ఆదిలాబాద్ వ్యవసాయం, న్యూస్‌టుడే : జిల్లాకు రెండు రోజులపాటు వర్ష సూచనలు ఉండటంతో 23వ తేదీ నుంచి ప్రారంభించాల్సిన పత్తి కొనుగోళ్లను 25కు వాయిదా వేసినట్లు జిల్లా పాలనాధికారి రాజర్షిషా తెలిపారు. సోమవారం సాయంత్రం ఎస్పీ గౌష్ ఆలంతో కలిసి మార్కెట్‌యార్డును సందర్శించి పత్తి కొనుగోళ్లకు సంబంధించిన ఏర్పాట్లను పరిశీలించారు. రైతులు ఇబ్బందులకు గురికాకుండా ఉండేందుకు కొనుగోళ్లను వాయిదా వేసినట్లు తెలిపారు. ఏర్పాట్లపై డీఏఓ గజానన్, కార్యదర్శి మధుకర్, శ్రీకాంత్‌లు కలెక్టరుకు వివరించారు.

కదం తొక్కిన ఆదివాసీలు.. అడ్డుకున్న పోలీసులు

● ఉద్రిక్తంగా మారిన తుడుందెబ్బ ఆందోళన

ఆదిలాబాద్ పాలనాప్రాంగణం, న్యూస్‌టుడే: రైతులకు రుణమాఫీ చేయాలని, రైతుభరోసా ఇవ్వాలని, పత్తి క్వింటాకు రూ.10 వేలు చెల్లించాలనే డిమాండ్లతో ఆదివాసీ హక్కుల పోరాట సమితి తుడుందెబ్బ, అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో సోమవారం ఆదిలాబాద్ కలెక్టరేట్ ఎదుట నిర్వహించిన ఆందోళన ఉద్రిక్తతకు దారి తీసింది. తొలుత కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించిన నాయకులు కలెక్టర్‌ను కలిసేందుకు బయలుదేరారు. లోనికి కొందరినే అనుమతిస్తామని పేర్కొనడం, నాయకులు పోలీసులతో వాగ్వాదానికి దిగడం, చివరకు ఇరువర్గాల నడుమ తోపులాటకు దారితీసింది. ఒక్కసారిగా వారంతా గేటును తోసుకుని లోనికి పరుగులు తీశారు. ఈ క్రమంలో ఒకరిద్దరు కిందపడిపోయారు. ఏం జరుగుతుందోననే అయోమయం నెలకొంది. డీఎస్పీ జీవన్‌రెడ్డి సారథ్యంలో సీఐలు, ఎస్సైలు, ప్రత్యేక బలగాలు కలెక్టరేట్‌కు చేరుకుని ఆందోళనకారులను నిలువరించారు. ఈ క్రమంలో పోలీసులు తమ జెండాలను పడేశారని, మహిళల పట్ల అసభ్యంగా ప్రవర్తించారని ప్రజావాణి విభాగం ఎదుట ఆదివాసీలు నినాదాలు చేశారు. విషయం తెలుసుకున్న పాలనాధికారి రాజర్షిషా బయటకురాగా పోలీసుల తీరుపై తుడుందెబ్బ నాయకులు అసహనం వ్యక్తం చేశారు. పోలీసుల చేత క్షమాపణ చెప్పించాలన్నారు. పాలనాధికారిని వారిని సముదాయించి వినతిపత్రం స్వీకరించడంతో ఆందోళన సద్దుమణిగింది. తుడుందెబ్బ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు గోడం గణేష్ మాట్లాడుతూ రైతు సమస్యలపై శాంతియుతంగా ఆందోళన చేస్తుంటే పోలీసులు అత్యుత్సాహం ప్రదర్శించారని ఆరోపించారు. పెట్టుబడి ఖర్చులతోపాటు అటవీ జంతువులతో పత్తి పంట దెబ్బతిని రైతులు నష్టపోతున్నారన్నారు. తుడుందెబ్బ జిల్లా ప్రధాన కార్యదర్శి వెట్టి మనోజ్, జిల్లా అధ్యక్షురాలు గోడం రేణుక, ఉయిక ఇందిర, ఆత్రం గణపతి, మెస్రం వెంకటేష్, తొడసం ప్రకాష్, బీఎస్పీ నాయకులు గద్దల శంకర్, ఆదివాసీలు పాల్గొన్నారు.


ఆదివాసీలు, పోలీసుల నడుమ తోపులాట


కలెక్టరేట్‌లోకి చొచ్చుకువస్తున్న ఆదివాసీలను అడ్డుకుంటున్న డీఎస్పీ



రామ రామ రామ ఉయ్యాలో..

తలమడుగు, న్యూస్‌టుడే: ఒక్కేసి పువ్వేసి చందమామ అంటూ ఆడబిడ్డలు బతుకమ్మను ఘనంగా గంగమ్మ ఒడికి సాగనంపారు. సోమవారం తలమడుగు మండలంలోని రుయ్యాడి గ్రామంలో బతుకమ్మలతో మహిళలు పుర వీధుల్లో భాజాభజంత్రీల మధ్య శోభాయాత్ర నిర్వహించారు. బతుకమ్మకు నైవేద్యాలను సమర్పించి, ప్రత్యేక పూజలు చేసి స్థానికంగా ఉన్న వాగులో నిమజ్జనం చేశారు.

భగీరథ ప్రయత్నం.. తాగునీటికి ఇక్కట్లే నిత్యం


నీటిట్యాంకుకు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన పైపులు

ఇంద్రవెల్లి, న్యూస్‌టుడే: మిషన్ భగీరథలో భాగంగా ఇంటింటికీ కుళాయిలు ఏర్పాటు చేయకపోవడంతో వాల్గొండ పంచాయతీ పరిధి అంద్‌గూడలో నిర్మించిన నీటి ట్యాంకు నుంచి నిత్యం ఇంటింటికీ తాగు నీరు సరఫరా కావడం లేదు. ట్యాంకు వరకు పదిహేను రోజుకోసారి మాత్రమే నీరు వస్తున్నాయని గ్రామస్థులు వాపోతున్నారు. భగీరథ నీరు రాని సమయంలో అప్పటి ఎమ్మెల్యే రాథోడ్ సుమన్ ఇక్కడే వేయించిన బోరు బావి నుంచి ఈ ట్యాంకుకు నీటిని సరఫరా చేస్తున్నారని, గత వేసవిలో ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు చొరవతో కొత్తగా పైప్‌లైన్ వేయించి ట్యాంకులోకి నీటిని సరఫరా చేయిస్తున్నారన్నారు. చేసేదేం లేక ఈ ట్యాంకుకు మోటార్లు బిగించి ప్రత్యేకంగా చిన్న పైపుల ద్వారా అక్కడి 30 కుటుంబాల వారు ఇంటింటికి తాగునీటిని సరఫరా చేసుకుంటున్నారన్నారు. ఈ విషయమై ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈఈ భానుకుమార్‌ను సంప్రదించగా మిషన్ భగీరథ పథకం ద్వారా ఇంటింటికీ సరఫరా అయ్యే పైపులు చెడిపోయి ఉంటే నీటి సరఫరా నిలిచిపోతుందని తెలిపారు. గ్రామాన్ని సందర్శించి చెడిపోయిన పైపులు మరమ్మతులు చేసేందుకు కృషి చేస్తానని వివరించారు.

నిప్పు పుడితే మిగిలేది బూడిదే!

● బోథ్‌లో అగ్నిమాపక కేంద్రం లేక అవస్థలు

న్యూస్‌టుడే, బోథ్

బోథ్ పేరుకే నియోజకవర్గ కేంద్రం. సౌకర్యాలు అంతంతమాత్రం. అగ్నిమాపక కేంద్రం లేదు. ఏటా అగ్ని ప్రమాదాలు సంభవించి ఇళ్లు, దుకాణాలు, పంటలు, వ్యవసాయ సామగ్రి అగ్నికి ఆహుతవుతున్నాయి. చిన్న ప్రమాదం చోటుచేసుకున్నా, అగ్నిమాపక యంత్రం వచ్చే లోపు రూ.లక్షల్లో ఆస్తి నష్టం సంభవిస్తోంది. కొన్ని సార్లు అగ్ని ప్రమాదాన్ని స్థానిక యువకులు, ప్రజలు ఆర్పివేసిన తరువాత అగ్నిమాపక శకటం వచ్చిన సందర్భాలు ఉన్నాయి. బోథ్‌లో అగ్నిమాపక కేంద్రాన్ని గతంలో ఏర్పాటు చేసి తొలగించారు.

మూడేళ్లలో జరిగిన అగ్ని ప్రమాదాలు : 14

ఇచ్చోడ నుంచి రావాలి..

బోథ్ మండలానికి అగ్నిమాపక శకటం రావాలంటే ఇచ్చోడ నుంచి రావాల్సిందే. బోథ్ నుంచి మారుమూల గ్రామానికి వెళ్లాలన్నా 20 నుంచి 25 కి.మీ ప్రయాణించాల్సి ఉంటుంది. ఇచ్చోడ నుంచి బోథ్‌కు రావాలంటే 40 కి.మీ. దూరం ప్రయాణించాల్సి ఉంటుంది. అగ్నిమాపక శకటం వచ్చే సరికి రూ.లక్షల్లో ఆస్తి నష్టం జరుగుతోంది. స్థానికంగా ఉంటే ప్రమాద తీవ్రతను తగ్గించవచ్చని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. బోథ్‌లో కేంద్రం ఏర్పాటు చేస్తే బజార్‌హత్నూర్, నేరడిగొండ మండలాల్లోని పలు గ్రామాలకు సైతం సేవలందించే అవకాశం ఉంటుంది.

ప్రమాదం జరిగితే రూ.కోట్లల్లో నష్టం

బోథ్‌లో నాలుగు, సొనాలలో ఓ పత్తి జిన్నింగ్ పరిశ్రమలు, ఆరు పెట్రోల్ బంకులు, ఓ మార్కెట్ యార్డు ఉన్నాయి. ఏటా ఈ పత్తి జిన్నింగ్‌లలో, వ్యవసాయ మార్కెట్ యార్డులో రైతులు తమ పంటలను విక్రయిస్తారు. ప్రమాదవశాత్తు ఇక్కడ అగ్ని ప్రమాదం చోటుచేసుకుంటే రూ.కోట్లలో ఆస్తి నష్టం జరుగుతుంది. సమయానికి అగ్నిమాపక యంత్రం రాకపోతే ప్రమాదాన్ని ఊహించలేం. పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతున్న ఈ ప్రాంతంలో అగ్నిమాపక కేంద్రాన్ని ఏర్పాటు చేయాల్సిన అవసరం ప్రభుత్వంపై ఉంది.

పెద్ద ప్రమాదం తప్పింది




బోథ్‌లోని ఓ జిన్నింగ్ మిల్లులో జనవరిలో అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. ఒక్కసారిగా మంటలు వ్యాపించాయి. సిబ్బంది గంటపాటు కష్టపడి మంటలను ఆర్పివేశారు. సిబ్బంది అప్రమత్తంగా ఉండటంతో పెద్ద ప్రమాదం తప్పింది.


కుచులాపూర్‌లో అగ్ని ప్రమాదంలో కాలిపోయిన ఇల్లు

ఇల్లు దగ్ధం..

బోథ్ మండలం కుచులాపూర్‌లో గతేడాది గ్రామానికి చెందిన సీరం సుదర్శన్ ఇంట్లో నుంచి ఒక్కసారిగా మంటలు ఎగిసిపడ్డాయి. ఇంటి పక్కనే ఉన్న సోదరుడు మల్లయ్య ఇంటికి సైతం మంటలు వ్యాపించాయి. గ్రామస్థులంతా కలిసి మంటలను ఆర్పివేశారు. సుదర్శన్ ఇల్లు పూర్తిగా, మల్లయ్య ఇల్లు పాక్షికంగా దగ్ధమైంది. వారి ఇంటి ముందు నిలిపిన సాయినాథ్ ద్విచక్రవాహనం సైతం కాలిపోయింది. రూ.25,000 నగదు బూడిదైంది. రూ.2 లక్షల వరకు ఆస్తి నష్టం జరిగింది. అగ్నిమాపక కేంద్రం ఉంటే ప్రమాద తీవ్రత తగ్గేది.


అగ్ని ప్రమాదంలో కాలిపోయిన ద్విచక్ర వాహనం

అగ్నిమాపక కేంద్రం ఏర్పాటు అవసరం



- షేక్‌షాకీర్, బోథ్

బోథ్ మండలంలో అగ్నిమాపక కేంద్రం ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది. ఈ ప్రాంతంలో ఏటా పదుల సంఖ్యలో అగ్ని ప్రమాదాలు జరిగి రూ.లక్షల్లో ఆస్తి నష్టం జరుగుతోంది. చాలా మంది తమ ఆస్తులను కోల్పోయారు. ప్రజాప్రతినిధులు స్పందించి కేంద్రాన్ని ఏర్పాటు చేయాలి.

నాలుగు గంటలు నిలిచిన విద్యుత్తు సరఫరా

బోథ్, న్యూస్‌టుడే: బోథ్ విద్యుత్తు ఉపకేంద్రం పరిధిలోని పలు గ్రామాల్లో సోమవారం మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు విద్యుత్తు సరఫరాలో అంతరాయం నెలకొంది. ఉపకేంద్రంలో సాంకేతిక సమస్య ఏర్పడటంతో విద్యుత్తు లేక ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఆదిలాబాద్ నుంచి వచ్చిన సాంకేతిక నిపుణులు సమస్యను పరిష్కరించారు.

సెనగ సాగుకు అనుకూలం

న్యూస్‌టుడే, ఆదిలాబాద్ వ్యవసాయం : జిల్లా భూములు యాసంగిలో సెనగ సాగుకు లాభదాయకంగా ఉంటాయని కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ రాజశేఖర్ తెలిపారు. యాజమాన్య పద్ధతులు పాటిస్తే ఆశించిన దిగుబడులు పొందే వీలుందని అన్నారు. వానాకాలంలో సోయా సాగు చేసిన రైతులు రెండో పంటగా సెనగ సాగు చేసుకుంటే మేలు. ఈ పంట చల్లని వాతావరణంలో పెరుగుతుందని ఆయన తెలిపారు.

ఇలా విత్తుకోవాలి..

ఎకరానికి 20 నుంచి 25 కిలోల విత్తనం అవసరం. ఆలస్యంగా వేసినట్లయితే మరో 20 శాతం అదనంగా వేసుకోవాలి. ఎండుతెగులు ఉంటే విత్తనశుద్ధి చేసుకోవాలి. కిలో విత్తనానికి నాలుగు గ్రాముల ట్రైకోడెర్మా వాడితే మంచి ఫలితం ఉంటుంది. విత్తిన తర్వాత పెండిమిథాలిన్ ఎకరాకు 1.5 లీటర్లు 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలి. విత్తిన 25 రోజులకు గొర్రుతో అంతర పంటలు సాగు చేసుకోవచ్చు. విత్తిన 20 రోజులకు ఒకసారి తిరిగి 30-40 రోజులలో రెండో సారి కలుపుతీయాలి.



సెనగ పచ్చ పురుగు

రైతేరాజు

ఎరువులు ఇలా..

నేల స్వభావాన్ని బట్టి నేలలో లభించే పోషకాల మోతాదును బట్టి ఎరువు వాడాలి. చివరి దుక్కిలో ఎకరానికి రెండు టన్నుల పశువుల ఎరువు వేసి కలియదున్నాలి. ఎకరా సెనగ సాగుకు 8 కిలోల నత్రజని, 20 కిలోల భాస్వరం, 8 కిలోల పొటాష్‌నిచ్చే ఎరువులను వేయాలి. నేలలో నిల్వలు సరిపడా ఉన్నప్పుడు భాస్వరం, పొటాష్ ఎరువులు వేసే అవసరం లేదు. ఈ ఎరువులను ఆఖరి దుక్కిలో వేయాలి. ఎకరాకు 18 కిలోల యూరియా, 125 కిలోల సింగిల్ సూపర్ ఫాస్ఫేట్ లేదా 50 కిలోల డీఏపీని వేసినచో పంటకు కావాల్సిన నత్రజని, భాస్వరం అందుతాయి. భాస్వరం ఎరువును సింగిల్ సూపర్ ఫాస్ఫేట్ రూపంలో వేసిన పంటకు కావాల్సిన గంధకము కూడా అందుతుంది.



సస్యరక్షణ

పంటను పచ్చపురుగు ఆశించి నష్టపరుస్తుంది. ఇది విత్తనాలు మొలిచిన 10-15 రోజుల నుండి ఆశించి పంట పరిపక్వదశకు చేరే వరకు ఉండి విపరీతమైన నష్టాన్ని కలిగిస్తుంది. నివారణకు సమగ్ర సస్యరక్షణ పద్ధతులు పాటించాలి. వేపకషాయాన్ని పిచికారీ చేయాలి.

విత్తనోత్పత్తి

విత్తనోత్పత్తిగా సాగు చేసే రైతులు సారవంతమైన, మురుగు నీరు నిలవని గత పంట కాలంలో సెనగ పంటను వేయని పొలాన్ని విత్తనోత్పత్తికి ఎన్నుకోవాలి. ఇతర సెనగ పంట పొలాల నుంచి కనీసం 5 మీటర్ల దూరంలో ఉండేలా చూసుకోవాలి. అక్టోబరు - నవంబరు 15లోగా విత్తనాలు విత్తుకోవడానికి అనుకూల సమయం. ఆయా ప్రాంతానికి అనువైన, తెగుళ్లను తట్టుకొని, అధిక దిగుబడిని ఇచ్చే రకాలను ఎన్నుకొని మూల విత్తనాన్ని అధీకృత సంస్థల నుంచి సేకరించి విత్తనోత్పత్తికి వాడాలి. విత్తిన 30-40 రోజుల సమయంలో తేలికపాటి తడి ఇస్తే దిగుబడి పెరిగి నాణ్యమైన విత్తనం లభించే వీలుంది.

రైతు ప్రశ్న — శాస్త్రవేత్త సమాధానం



డా. శివకృష్ణ, వ్యవసాయ శాస్త్రవేత్త, కృషి విజ్ఞాన కేంద్రం బెల్లంపల్లి
చరవాణి సంఖ్య: 91002 29854

ప్రస్తుతం కందిని మచ్చల పురుగు ఆశిస్తోంది. నివారణ చర్యలు తెలపండి?
- సత్యనారాయణ, రైతు, తపాల్‌పూర్

✓: మచ్చల పురుగు నివారణకు 2.5 మిల్లీ లీటర్ల క్లోరోపైరిపాస్ లేదా 0.75 మిల్లీలీటర్ల నోవల్యురాన్ మందును లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి. ఉద్ధృతి ఎక్కువగా ఉంటే స్పైనోషాడ్ 0.3 మి.లీ లేదా ఎమామెక్టిన్ బెంజోయేట 0.4మి.లీ, లేదా ఫ్లూబెండమైడ్ 0.2 మిల్లీలీటర్లు ఒక లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.


యాసంగిలో వేయదగిన ఆరుతడి పంటలు ఏవి? -వెంకటేశ్, రైతు, కాసిపేట

✓: పంట మార్పిడి చేసి ఆరుతడి పంటలు వేయడం వల్ల నేల సారవంతంగా మారుతుంది. వేరుసెనగలో కదిరి-6, కదిరి-9, టీఏజీ-24 రకాలు వేసుకుంటే ఎకరానికి 8క్వింటాళ్ల దిగుబడి వస్తుంది. పెసరలో ఎంజీటీ-295, డబ్ల్యూజీజీ-37, రకాలు 4 క్వింటాళ్లు, నువ్వులలో శ్వేత, హిమ, గౌరి రకాలు ఎకరాలకు 2.5 క్వింటాళ్ల మేర దిగుబడి వస్తుంది. ప్రస్తుత వానాకాలం పంట పూర్తి కాగానే వీటిని విత్తుకోవచ్చు.

పాడి.. లాభాలు దండి



స్వాతిరెడ్డి



కజ్జర్లలో ఏర్పాటు చేసిన డెయిరీ ఫాంలో గేదెలు

వ్యవసాయంతో పాటు అనుబంధ రంగాలను ఎంపిక చేసుకొని వాటిని నిత్య ఆదాయ మార్గాలుగా మార్చుకోవచ్చని నిరూపిస్తున్నారు తలమడుగు మండలం కజ్జర్లకు చెందిన మహిళా రైతు స్వాతిరెడ్డి. 2020లో కజ్జర్లలో తండ్రి స్వామిరెడ్డి ప్రోత్సాహంతో 20 ముర్రాజాతి గేదెలతో సొంత స్థలంలో డెయిరీఫాం ఏర్పాటు చేసుకున్నారు. నిర్వహణకు ఇద్దరు కూలీలను నియమించారు. పొలంలోనే 2 ఎకరాల స్థలంలో సుఫారీ నేపియర్ గడ్డిని పెంచి ఏడాది పొడవునా గేదెలకు పచ్చి గడ్డి ఉండేలా ఏర్పాట్లు చేసుకున్నారు. పత్తిచెక్క, వరి తవుడు, పెసర చున్నీని దాణాగా పెడుతున్నారు. 2024 నాటికి మరో 30 గేదెలను కొనుగోలు చేసి మొత్తం 50 గేదెలతో డెయిరీ ఫాం నిర్వహిస్తున్నారు. గేదెలు నిత్యం 150 లీటర్ల పాలు ఇస్తుండగా వాటిని ఆదిలాబాద్ పట్టణానికి తీసుకెళ్లి విక్రయిస్తున్నారు. ప్రతి నెలా రూ.3 లక్షల వరకు ఆదాయం వస్తోంది. కూలీలు, డెయిరీ ఫాం నిర్వహణ ఖర్చులకు రూ.1 లక్ష పోగా.. రూ.2 లక్షల లాభం వస్తోందని ఆమె తెలిపారు. ప్రతి పంట కాలం మొదట్లో పేడ విక్రయం ద్వారా అదనంగా రూ.1 లక్ష ఆదాయం వస్తోందన్నారు. ప్రస్తుతం నలుగురు కూలీలకు ఉపాధి కల్పిస్తున్నారు. మార్కెట్‌లో పాల విక్రయం అధికంగా ఉండటంతో ఏటా గేదెల కొనుగోలు చేస్తున్నారు. ప్రణాళికాబద్ధంగా కష్టపడితే ఆశించిన లాభాలు వస్తాయంటున్నారు.


ఆదర్శం

మొక్కజొన్నలు పశుగ్రాసంగా..

మీకు తెలుసా?

చాలా మంది రైతులు మొక్కజొన్న కంకులను ఎరువుగా, వంట చెరకుగా వాడుతున్నారు. ఈ కంకులలో మామూలు పశుగ్రాసాలలో ఉన్నట్లు 3-5 శాతం వరకు మాంసకృత్తులు, 55 శాతం పిండి పదార్థాలున్నాయి. ఈ కంకులను పశువులు నమిలి తినడం కష్టం. అందువల్ల వాటిని ఎండబెట్టి, యంత్రం ద్వారా పొడిగా చేసుకొని పశుగ్రాసాల కొరత సమయాలలో వాడుకోవచ్చు.

విద్యార్థి భవితవ్యానికి అపార్



న్యూస్‌టుడే, మంచిర్యాల విద్యావిభాగం :

జాతీయ విద్యావిధానంలో భాగంగా కేంద్ర ప్రభుత్వం ఆధార్ తరహాలో ప్రత్యేక గుర్తింపు కార్డులు జారీ చేయాలని నిర్ణయించింది. వన్ నేషన్ వన్ స్టూడెంట్ పేరిట ప్రభుత్వ, ప్రైవేటు, కార్పొరేట్ విద్యాసంస్థల్లో కేజీ నుంచి పీజీ వరకు దేశంలోని ప్రతి విద్యార్థికి 12 అంకెలతో కూడిన ఒక ప్రత్యేక ఐడీని అపార్ (ఆటోమేటెడ్ పర్మినెంట్ అకాడమిక్ అకౌంట్ రిజిస్ట్రీ) కేటాయించనున్నారు. ఇది దేశంలో ప్రతి విద్యార్థికి అందించే గుర్తింపు నంబరు. ఆన్‌లైన్ నమోదుకు ఈ మేరకు రాష్ట్ర విద్యాశాఖ అన్ని జిల్లాల విద్యా శాఖల అధికారులకు ఆదేశాలు జారీ చేసింది.

ఉమ్మడి జిల్లాలోని ఆదిలాబాద్, నిర్మల్, మంచిర్యాల, కుమురంభీం జిల్లా వ్యాప్తంగా 4822 ప్రభుత్వ, ప్రైవేటు, గురుకులాలు, ఆదర్శ, కస్తూర్బా పాఠశాలలు కొనసాగుతున్నాయి. 4 లక్షల మందికి పైగా విద్యార్థులు ఆయా మాధ్యమాల తరగతుల్లో చదువుతున్నారు. పిల్లలకు పాఠశాల స్థాయిలో చైల్డ్ ఇన్ఫో ద్వారా ఒక ఐడీ, కళాశాల స్థాయిలో మరో ఐడీ ఉంటుంది. ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం అందించే అపార్ కార్డులోనే పూర్తి సమాచారం ఉండనుంది. అపార్‌కార్డు ద్వారా కేటాయించే సంఖ్య జీవిత కాలం ఐడీగా పరిగణిస్తారు. ఇందులో విద్యార్థికి సంబంధించిన కేజీ టూ పీజీ వరకు విద్యార్థి పూర్వ వివరాలు, సాధించిన విజయాలు, ఉపకార వేతనాలు, మెమోలు, ధ్రువపత్రాలు ఆధార్ అనుసంధానం ఉండటంతో కుటుంబ వివరాలు అందుబాటులో ఉంటాయి.



అపార్ నమూనా కార్డు

అంగీకారం తప్పనిసరి

కేంద్ర ప్రభుత్వం జారీచేసే ఈ అపార్‌కార్డు వివరాలు పూర్తి గోప్యంగా ఉంటాయి. దీనిని పొందేందుకు తల్లిదండ్రుల అంగీకారం తప్పనిసరిగా తీసుకోవాలని కేంద్ర మంత్రిత్వ శాఖ ఆదేశించింది. ఇటీవల విద్యాశాఖ అధికారులు ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో జూమ్ మీటింగ్ నిర్వహించి కార్యక్రమం నిర్వహణపై అవగాహన కల్పించారు. గత శనివారం నిర్వహించిన పీటీఎం (పేరెంట్స్ టీచర్స్ మీటింగ్)లో ప్రధానోపాధ్యాయులు తల్లిదండ్రులతో దీని గురించి వివరించారు. పాఠశాలల్లో, ఆధార్ కార్డులో వివరాలు ఒకేలా ఉండాలని లేనివారు మార్పులు చేసుకోవాలని సూచించారు. తర్వాత మార్పులకు అవకాశం ఉండదని.. అపార్ ప్రాముఖ్యాన్ని వివరిస్తూ అంగీకార పత్రాలపై అవగాహన కల్పించారు.

కార్డులో పొందుపర్చే అంశాలు

డిజిటల్ కార్డుపై విద్యార్థి పేరు, పుట్టిన తేదీ, లింగం, ఫొటో క్యూఆర్ కోడ్, 12 అంకెలతో కూడిన గుర్తింపు సంఖ్య ఉంటాయి.

ఉపయోగాలు

- ✦ విద్యార్థులు ఒక పాఠశాల నుంచి మరో పాఠశాలకు మారేటప్పుడు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఉంటుంది.
- ✦ అపార్ గుర్తింపుతో డిజీలాకర్‌కు అనుసంధానమవుతారు. విద్యావిషయ విజయాలు, ధ్రువపత్రాలు డిజిటల్ రూపంలో సురక్షితంగా భద్రపరుచుకోవచ్చు.
- ✦ విద్యార్థుల ఉపకార వేతనాలు, వారు పొందుతున్న ప్రయోజనాలు, వివిధ విద్యాసంస్థల్లో చేరికలు, మార్పులు, ఉద్యోగాల భర్తీ సమయం ఇతర సందర్భాల్లో సమాచారం అపార్ ఆధారంగా నిర్వహించేలా రూపొందించారు.

ఒకే ఐడీలో పూర్తి వివరాలు




కేంద్రం ప్రభుత్వం తీసుకొస్తున్న అపార్ కార్డు విద్యార్థులకు ఎంతో ఉపయోగపడనుంది. ఒకే నంబరులో విద్యార్థికి సంబంధించి పూర్తి వివరాలు నమోదుకానున్నాయి. దీనికి తల్లిదండ్రుల అనుమతి తప్పనిసరి. ఈ మేరకు ప్రధానోపాధ్యాయులకు సమాచారం ఇచ్చాం. ఇటీవల తల్లిదండ్రుల సమావేశాల్లో సైతం వారికి వివరించాం.

- ఎస్.యాదయ్య, డీఈవో మంచిర్యాల

కంది మొక్క.. 12 అడుగులు

మంచిర్యాల జిల్లా లక్షెట్టిపేట మండలం జెండా వెంకటాపూర్‌లో కోన ఓదెలు ఇంటి ఆవరణలో ఏపుగా ఎదిగిన కంది మొక్క ఇది. సాధారణంగా కంది మొక్క మూడు నుంచి ఆరు అడుగులు పెరగడం సాధారణం. అలాంటిది వారి ఇంటి ముందు ఉన్న మొక్క 12 అడుగుల మేర పెరిగింది. ఇంటికన్నా ఎక్కువ ఎత్తు పెరిగిన ఆ చెట్టును గ్రామస్థులు ఆశ్చర్యంగా చూస్తున్నారు. దీనిపై బెల్లంపల్లి కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త ఇస్లావత్ తిరుపతిను సంప్రదించగా విత్తనాల్లో జన్యుమార్పిడి కారణంగా ఒక్కోసారి మొక్క పెరుగుదల అసాధారణంగా ఉంటుందన్నారు. ఇదే మొక్క నుంచి సేకరించిన విత్తనాలు ఇదే స్థాయిలో ఎదగకపోవచ్చని ఆయన తెలిపారు.



ఏపుగా ఎదిగిన కంది మొక్క వద్ద ఇంటి యజమాని ఓదెలు

- న్యూస్‌టుడే, లక్షెట్టిపేట

విద్యుదాఘాతంతో విద్యార్థి మృతి

రామకృష్ణాపూర్, న్యూస్‌టుడే : మందమర్రి రెండో జోన్‌కు చెందిన జి.సత్యఅన్వేష్ (21) అనే విద్యార్థి విద్యుదాఘాతంతో సోమవారం మృత్యువాత పడ్డాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మంచిర్యాలలో డిగ్రీ తృతీయ సంవత్సరం చదువుతున్న సత్యఅన్వేష్ సోమవారం సాయంత్రం ఇంట్లో స్నానం చేసి టవల్ తీగపై ఆరవేస్తున్న క్రమంలో విద్యుదాఘాతానికి గురయ్యాడు. వెంటనే మందమర్రి డిస్పెన్సరీకి.. అనంతరం మెరుగైన వైద్యం కోసం ఆర్కేపీ ఏరియా ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందాడు. మందమర్రి ఎస్సై రాజశేఖర్‌ను సంప్రదించగా ఇంకా ఫిర్యాదు అందలేదని తెలిపారు.



జి.సత్యఅన్వేష్

పతుల కోసం సతుల పూజలు

ఘనంగా కర్వాచౌత్ పండగ

రెబ్బెన, న్యూస్‌టుడే: సాధారణంగా ఉత్తర్ ప్రదేశ్, పంజాబ్, హరియాణా, మధ్యప్రదేశ్, రాజస్థాన్ తదితర ప్రాంతాల్లో కర్వా చౌత్ పండగను కనులపండువగా నిర్వహిస్తుంటారు. ఏడాదికి ఒకసారి వచ్చే కార్తిక మాసంలోని కృష్ణపక్ష చతుర్థి రోజున ప్రత్యేకంగా వివాహితులైన మహిళలు మాత్రమే దీన్ని ఆచరిస్తుంటారు. ఆ రోజు సూర్యోదయానికి ముందు ఉపవాసం ప్రారంభించి రాత్రి చంద్రుని దర్శనం తర్వాత ముగిస్తారు. రాష్ట్రంలోని పలు ప్రాంతాలతోపాటు రెబ్బెన మండల కేంద్రంలో స్థిరనివాసం ఏర్పరుచుకున్న పలు కుటుంబాలు ఈ పండగను ఘనంగా కొనసాగిస్తుంటారు.

గ్రామీణ ప్రాంత మహిళలే కాకుండా పట్టణాల్లోని వారు కూడా కర్వా చౌత్ ఉపవాసాన్ని ఎంతో భక్తిశ్రద్ధలతో పాటు ఉత్సాహంగా పాటిస్తుంటారు. శాస్త్రాల ప్రకారం కార్తిక మాసంలోని కృష్ణ పక్షంలో చంద్రోదయ చతుర్థి రోజున వ్రతాన్ని ఆచరించాలి. కార్తీక కృష్ణ పక్ష చతుర్థి రోజున కర్కచతుర్థి (కర్వా చౌత్) ఉపవాసం పాటించే సంప్రదాయం ఉంది. భర్తలు ఎల్లప్పుడు యోగక్షేమాలతోపాటు దీర్ఘాయువుగా ఉండాలనే ఉద్దేశంతో సతులు పండగను నిర్వహిస్తారు. ఉదయం 4 గంటల నుంచి ఉపవాసం తీసుకొని కనీసం నీళ్లు కూడా తాగకుండా రాత్రి చంద్రుని దర్శనం కోసం ఎదురు చూస్తారు. బాలచంద్ర గణేష్‌కు పూజలు చేసిన తర్వాత అందరూ కలిసి తులసి చెట్టు వద్ద ప్రత్యేక పూజలు చేస్తారు. రాత్రి జల్లెడలో చంద్రుడిని దర్శించుకుని ఆహారం తీసుకోవడంతో ఉపవాసం ముగుస్తుంది.



తులసి చెట్టుకు పూజలు చేస్తున్న మహిళలు

శెభాష్ సంజయ్

● మూడు మైనింగ్ ఉద్యోగాలకు ఎంపికైన మిట్టపల్లి యువకుడు

న్యూస్‌టుడే, జైపూర్ :

సాదాసీదా మధ్య తరగతి కుటుంబం వారిది. తండ్రి సింగరేణిలో ఉద్యోగం చేస్తున్నప్పటికి కుటుంబం పెద్దది కావడంతో వారిని పోషించడంలో చాలా కష్టాలను ఎదుర్కొన్నాడు. తనలా తన కుమారుడు కావొద్దని.. తను పనిచేసిన సింగరేణి లోనే అధికారిగా పని చేయాలని ఆయన కలలు కన్నాడు. తండ్రి పడ్డ కష్టం.. తన మీద పెట్టుకున్న ఆశలు మరింత బాధ్యతను పెంచాయి. దీంతో పట్టుబట్టి ఒకటి కాదు రెండు కాదు ఏకంగా మూడు ఎగ్జిక్యూటివ్ స్థాయి మైనింగ్ ఉద్యోగాలు సాధించి శెభాష్ అనిపించారు రామటెంకి సంజయ్‌కుమార్.

మిట్టపల్లి గ్రామానికి చెందిన రామటెంకి పోషం-రాజమ్మ దంపతులకు ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు. అందరికన్న చిన్నవాడు సంజయ్. తండ్రి చిన్నతనంలోనే సింగరేణిలో ఉద్యోగ విరమణ కావడం... ఆయన ప్రోత్సాహంతో భవిష్యత్తులో తాను సింగరేణి అధికారి కావాలనే లక్ష్యంగా పెట్టుకున్నాడు. దీంతో 2013 ఎంసెట్‌లో ఉత్తమ ప్రతిభ కనబర్చి కొత్తగూడెంలోని కొత్తగూడెం స్కూల్ ఆఫ్ మైన్స్‌లో ఉత్తమ మార్కులతో బీటెక్ పూర్తి చేశాడు. ఈ క్రమంలో కొంతకాలం జెన్‌టీయూలో ఒప్పంద అధ్యాపకుడిగా కూడా పని చేశాడు. అదే క్రమంలో జీవితంలో మరింత సాధించాలనే తపనతో గేట్ పరీక్ష రాసి 2020లో ఐఐటీ ధన్‌బాద్‌లో మైనింగ్‌లో ఎంటెక్ చేసి కాలేజీలో మొదటి ర్యాంకు సాధించి బంగారు పతకం కూడా అందుకున్నాడు. 2022లో మహారత్న కంపెనీ అయిన కోల్ ఇండియాలో అండర్ మేనేజర్‌గా ఉద్యోగం సాధించాడు. ప్రస్తుతం మహారాష్ట్రలోని వెస్ట్రన్ కోల్ ఫీల్డ్ వాణి నార్త్ ఏరియాలో విధులు నిర్వర్తిస్తున్నాడు. ఇదే క్రమంలో 2023లో మరో మహారత్న కంపెనీ అయిన నేషనల్ థర్మల్ పవర్ కార్పొరేషన్(ఎన్‌టీపీసీ)లో ఎగ్జిక్యూటివ్ స్థాయి ఉద్యోగం వచ్చినప్పటికి అందులో చేరలేదు. ఈ ఏడాది జులైలో సింగరేణి ఆధ్వర్యంలో నిర్వహించిన మేనేజ్‌మెంట్ ట్రైనీ(మైనింగ్) పరీక్షలో ఉత్తమ ప్రతిభ చూపి అండర్ మేనేజర్‌గా ముచ్చటగా మూడో ఉద్యోగం సాధించగా తల్లిదండ్రుల కోరిక మేరకు సింగరేణిలోనే ఉద్యోగ బాధ్యతలను నిర్వర్తించాలని కోరుకుంటున్నాడు సంజయ్.



ఐఐటీ ధన్‌బాద్ డైరెక్టర్ రాజీవ్ శేఖర్ నుంచి బంగారు పతకం అందుకుంటున్న రామటెంకి సంజయ్‌కుమార్

ప్రజా సమస్యల పరిష్కారానికి చర్యలు

ఉట్నూరు, న్యూస్‌టుడే : ఏజెన్సీలోని గిరిజనుల సమస్యల పరిష్కారానికి సంబంధిత అధికారులు త్వరితగతిన చర్యలు చేపట్టాలని ఐటీడీఏ పీవో ఖుష్బూగుప్తా అన్నారు. సోమవారం ఉట్నూరు ఐటీడీఏ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల విభాగంలో ఆయా ప్రాంతాల నుంచి తరలివచ్చిన ఆదివాసీ గిరిజనులు వారి సమస్యలను వివరించారు. ఉట్నూరు మండలం బోయవాడకు చెందిన శంకర్ తనకు ఉద్యోగం ఇప్పించాలని, కాసిపేట మండలం మాలకెపల్లికి చెందిన ఆత్రం శంకర్ తన ఉన్నత చదువుల కోసం ల్యాప్‌టాప్ మంజూరు చేయాలని కోరారు. ఇచ్చోడ మండలం జల్దాకు చెందిన గణేష్ కిరాణ దుకాణం కోసం రుణం మంజూరు చేయాలని, దహేగాం మండలం దేవులగూడకు చెందిన సోములాల్ తన భూమి పట్టా చేయాలని కోరారు. రెండు పడక గదుల ఇళ్లు, స్వయం ఉపాధి పథకాల మంజూరు, వ్యవసాయ, రెవెన్యూ శాఖలకు సంబంధించిన సమస్యలతో కూడిన అర్జీలు పలువురు సమర్పించారు. ఏపీఓ వసంత్‌రావు, ఏడీఎంఅండ్‌హెచ్‌ఓ కుడ్మెత మనోహర్, ఈఈ భీంరావు, ఏవో దామోదర్‌రావు, పీహెచ్‌ఓ సందీప్‌కుమార్, డీపీఓ ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.



ఉట్నూరు ఐటీడీఏ కార్యాలయంలో అర్జీలు స్వీకరిస్తున్న పీవో ఖుష్బూగుప్తా

నవంబరు 5 నుంచి రాష్ట్రస్థాయి క్రీడా పోటీలు

ఉట్నూరు గ్రామీణం, న్యూస్‌టుడే : ఉట్నూరు కుమురం భీం ప్రాంగణంలో నవంబరు 5 నుంచి 7వ తేదీ వరకు రాష్ట్రస్థాయి క్రీడా పోటీలు నిర్వహించనున్నామని ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా తెలిపారు. క్రీడాకారులకు అన్ని రకాల సౌకర్యాలు కల్పించాలన్నారు. సోమవారం పోటీల నిర్వహణపై సమీక్షా సమావేశం నిర్వహించారు. క్రీడాకారులకు వసతి, అందించాల్సిన భోజన సౌకర్యాలపై చర్చించారు. అసౌకర్యాలు కలగకుండా చూడాలని ఆయా శాఖల అధికారులను ఆదేశించారు. ప్రారంభోత్సవానికి అతిథుల ఆహ్వానపత్రాలు, విద్యుత్తు, వైద్యం, ఆట వస్తువులు సకాలంలో సిద్ధం చేయాలని సూచించారు. ఏపీవో వసంత్‌రావు, ఈఈ భీంరావు, ఉమ్మడి జిల్లాల క్రీడల అధికారులు పాల్గొన్నారు.

అన్నయ్య ప్రోత్సాహంతో



ఆదిలాబాద్ పట్టణంలోని భుక్తాపూర్ కాలనీలో అశోక్, వందన దంపతుల కూతురు నిఖిత. డీఎస్సీ ఫలితాల్లో ఎస్జీటీగా ఎంపికయ్యారు. తన అన్నయ్య, ఉపాధ్యాయుడు మంద కిరణ్ అన్ని రకాలుగా ప్రోత్సహించారన్నారు. బీసీ స్టడీ సర్కిల్ ద్వారా ఆన్‌లైన్ యాప్‌తో విలువైన సలహాలు తీసుకున్నామని తెలిపారు. ఇవి ఉద్యోగ సాధనకు ఎంతో ఉపకరించాయని పేర్కొన్నారు.

మేస్త్రీ పని చేస్తూ



నేరడిగొండకు చెందిన ఇ.గంగాధర్ తల్లిదండ్రులు గంగారాం, పోసాని బీడీ కార్మికులుగా పని చేస్తారు. ప్రభుత్వం అందించే ఫీజు రీయింబర్స్‌మెంట్ సాయంతో డిగ్రీ, కష్టాలు పడుతూనే బీఈడీ పూర్తి చేశారు. వివాహం తర్వాత బతుకుదెరువు కోసం మేస్త్రీగా పని చేయాల్సి వచ్చింది. డీఎస్సీ కోసం బీసీ స్టడీ సర్కిల్‌లో చేరి స్కూల్ అసిస్టెంట్‌గా ఉద్యోగం సాధించారు.

తల్లిదండ్రులు గర్వపడేలా



తాంసి మండలం కప్పర్ల గ్రామానికి చెందిన నర్సమ్మ, శంకర్‌ల కూతురు జ్ఞాన ప్రగతి. చిన్నప్పటి నుంచే చదువులో చురుగ్గా ఉండేది. స్కూల్ అసిస్టెంట్ తెలుగులో మూడో ర్యాంకు సాధించి ఉద్యోగానికి ఎంపిక కాగా, భాషా పండితురాలుగా ఆరో ర్యాంకు సాధించారు. క్రమం తప్పకుండా బీసీ స్టడీ సర్కిల్‌కు వెళ్లి తోటి విద్యార్థులతో కలిసి చదువుకున్నారు. తల్లిదండ్రులు గర్వపడేలా ఉద్యోగం సాధించారు.

ఉచిత శిక్షణ.. ఉద్యోగాల సాధన

ప్రభుత్వ స్టడీ సర్కిళ్ల ద్వారా 77 మంది ఎంపిక

ఆదిలాబాద్ అర్బన్, న్యూస్‌టుడే: ప్రభుత్వ స్టడీ సర్కిళ్లు నిరుద్యోగులకు వరంగా మారాయి. ఉద్యోగాల సాధనకు అవసరమైన సదుపాయాలను ఉచితంగా కల్పిస్తున్నాయి. మెరుగైన వసతులుండటం, స్టడీ మెటీరియల్‌ను అందిస్తుండటంతో నిరుద్యోగ యువతలో మార్పు వస్తోంది. సివిల్స్, గ్రూప్స్‌వంటి ఉద్యోగాలతోపాటు అన్ని రకాల ఉద్యోగాలకు సన్నద్ధమయ్యేందుకు శిక్షణ ఇస్తున్నారు. మరికొందరు ఉదయం 6 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు స్టడీ హాళ్లలో సాధన చేస్తున్నారు. వాట్సప్, టెలిగ్రామ్ గ్రూపులను ఏర్పాటు చేసి అభ్యర్థులకు విద్య, ఉద్యోగరంగాలకు సంబంధించిన సమాచారం, ఉద్యోగ ప్రకటనలు చేరవేస్తున్నాయి.



బీసీ స్టడీ సర్కిల్ హాలులో చదువుకుంటున్న యువతులు

ఇటీవల ప్రభుత్వం నిర్వహించిన డీఎస్సీలో ఉద్యోగాలు సాధించిన అభ్యర్థుల్లో 77 మంది స్టడీ సర్కిళ్లలో సాధన చేసినవారే కావడం గమనార్హం. బీసీ స్టడీ సర్కిల్‌లో సాధన చేసిన వారిలో 51 మంది ఉద్యోగాలు సాధించారు. ఇందులో 34 మంది ఎస్జీటీలుకాగా 17 మంది స్కూల్ అసిస్టెంట్ ఉద్యోగాలు పొందారు. ఎస్సీ స్టడీ సర్కిల్‌లో శిక్షణ పొందిన వారిలో మొత్తం 26 మందికి ఉద్యోగాలు వచ్చాయి. అందులో ఎస్జీటీ 17 మంది, స్కూల్ అసిస్టెంట్‌కు 9 మంది ఎంపికయ్యారు.

కన్నవారి కల నెరవేర్చారు



ఆదిలాబాద్ పట్టణంలోని భాగ్యనగర్‌లో స్థిరపడ్డ బత్తుల సత్యనారాయణ, సునీతల పెద్ద కూతురు సృష్టి. భీంసరి గ్రామంలోని ఎకరం పొలంలో తల్లిదండ్రులు కష్టపడి ఇద్దరు కూతుళ్లను చదివించారు. సృష్టి బీసీ స్టడీ సర్కిల్‌లో చేరి ఆన్‌లైన్ యాప్‌తో ఉద్యోగ సాధనకు విలువైన చిట్కాలు తెలుసుకున్నారు. ఎస్జీటీగా ఎంపికై తల్లిదండ్రుల కల నెరవేర్చారు.

గుడిహత్నూర్, న్యూస్‌టుడే:

? మండలంలోని జాతీయ రహదారి డొంగర్‌గాం సమీపంలోని యూటర్న్ వద్ద ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. అక్కడ సూచికలు ఏర్పాటు చేయాలి. - భీంరావ్, డొంగర్‌గావ్

✔ జాతీయ రహదారిపై ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకుంటాం. నేషనల్ హైవే అథారిటీ అధికారులతో మాట్లాడి సూచికలు ఏర్పాటు చేయిస్తాం. - ఇమ్రాన్, ఎస్ఐ గుడిహత్నూర్


నిజామాబాద్‌లోని శ్రీమెడికేర్ సర్వీసెస్ ప్రైవేటు లిమిటెడ్ కంపెనీలో గంజాయిని దహనం చేస్తున్న ఎక్సైజ్ అధికారులు

రూ.కోటి విలువైన గంజాయి దహనం

ఎదులాపురం, న్యూస్‌టుడే: జిల్లాలో వివిధ కేసుల్లో పట్టుబడ్డ రూ.కోటి విలువ గల 411 కిలోల గంజాయిని నిజామాబాద్ జిల్లాలోని శ్రీమెడికేర్ సర్వీసెస్ ప్రైవేటు లిమిటెడ్‌లో సోమవారం దహనం చేశారు. ఉట్నూరు, ఇచ్చోడ, ఆదిలాబాద్ ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ పరిధిలో పలు కేసుల్లో పట్టుబడ్డ గంజాయిని ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు నిజామాబాద్‌లో ఎక్సైజ్ సూపరింటెండెంట్ హిమశ్రీ, ఎక్సైజ్ అధికారుల సమక్షంలో కాల్చివేశారు. ఆదిలాబాద్ కమిషనర్ నరసింహారెడ్డి ఆదేశాల మేరకు ఈ చర్యలు తీసుకున్నట్లు ఆమె తెలిపారు.

అట్రాసిటీ కేసులో మరో నిందితుడికి రిమాండ్

ఆదిలాబాద్ నేర విభాగం, న్యూస్‌టుడే: ఆదిలాబాద్ గ్రామీణ పోలీస్ స్టేషన్‌లో నమోదైన అట్రాసిటీ కేసులో పోలీసులు మరో నిందితుడిని సోమవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ నెల 13న సైదాపూర్ నుంచి భీంసరి గ్రామానికి వాహనాల్లో డీజే, జనరేటర్ తీసుకెళ్తున్న రాథోడ్ చరణ్‌సింగ్, రాథోడ్ గులాబ్, రాథోడ్ అశోక్‌లపై దాడి చేసిన వారిపై పోలీసులు అట్రాసిటీ కేసు నమోదు చేయగా నిందితులంతా పరారయ్యారని డీఎస్పీ ఎల్.జీవన్‌రెడ్డి తెలిపారు. దాడి చేసిన రామాయి గ్రామానికి చెందిన జిట్ట ప్రభాకర్, జిట్ట రత్నాకర్, శ్యాంబాబు, అనిల్, ఈశ్వర్, జ్ఞానేశ్వర్, స్వామి, దత్తుతోపాటు మరికొందరిపై అట్రాసిటీ కేసు నమోదు చేశామన్నారు. ఆదివారం ఎ.శ్యాంసుందర్‌ను అరెస్టు చేయగా సోమవారం జిట్ట అనిల్‌ను అరెస్టు చేసి కోర్టులో హాజరుపర్చగా న్యాయమూర్తి జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించాలని ఆదేశాలు ఇచ్చారన్నారు.

కారు, ట్రాక్టర్ ఢీ

సోనాల(బోథ్), న్యూస్‌టుడే: కారు, ట్రాక్టర్ ఢీకొన్న ఘటన మండలంలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం బోథ్ మండలంలోని ఘన్‌పూర్ అంతర్రాష్ట్ర రహదారిపై ఘన్‌పూర్ వైపు నుంచి సోనాల వైపు కారు వస్తుండగా, గుట్టపక్కతండా గ్రామం లోపలి నుంచి ట్రాక్టరు అంతర్రాష్ట్ర రహదారి పైకి వచ్చింది. ట్రాక్టరు కారును ఒక్కసారిగా ఢీకొట్టింది. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

సూపర్ మార్కెట్‌లో చోరీ

ఆదిలాబాద్ నేర విభాగం, న్యూస్‌టుడే: పట్టణంలోని రాంనగర్‌లో అబిడేక చెందిన సాయిబాబా సూపర్ మార్కెట్‌లో సోమవారం తెల్లవారుజామున చోరీ జరిగింది. మావల ఎస్ఐ వంగ విష్ణువర్ధన్ తెలిపిన వివరాల మేరకు ఉదయం సూపర్ మార్కెట్ తెరవటానికి వెళ్లగా షట్టర్ పగుల గొట్టబడి ఉండటాన్ని గమనించారు. లోపలికి వెళ్లి చూడగా గల్లా పెట్టెలో ఉండాల్సిన రూ.14 వేలు కనబడలేదు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ప్రమాదానికి కారణమైన ఆటో డ్రైవర్‌పై కేసు

ఆదిలాబాద్ నేర విభాగం, న్యూస్‌టుడే: ద్విచక్రవాహనదారుడిని ఆటోతో ఢీకొట్టి గాయపర్చిన ఆటో డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు టూటౌన్ సీఐ కరుణాకర్‌రావు తెలిపారు. సోమవారం భుక్తాపూర్ వద్ద యూటర్న్‌ను ద్విచక్రవాహనంపై దాటేందుకు ప్రయత్నిస్తున్న శాంతినగర్‌కు చెందిన సాయిని గంగన్నను ఆటో ఢీకొంది. దీంతో ఆతడికి తీవ్ర గాయాలయ్యాయి. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు.

మహనీయులకు ఘన నివాళి

బేల, న్యూస్‌టుడే: కుమురం భీం, కుంరం సూరు వర్ధంతిని సోమవారం బేల మండల కేంద్రంలో నిర్వహించారు. స్థానిక కుమురంభీం చౌక్‌లోని ఆయన విగ్రహానికి, సమీపంలోని కుంరం సూరు చిత్రపటానికి ఆదివాసీ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అంతకుముందు గిరిజన సంప్రదాయబద్ధంగా డోలు, సన్నాయిలతో నృత్యాలు చేస్తూ జాతీయ రహదారిపై శోభాయాత్ర నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. సీఐ సాయినాథ్, ఎస్ఐ డి.రాధిక, కాంగ్రెస్ నాయకుడు సంజయ్ గుండావార్, ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆడ శంకర్ ఆదివాసీలు పాల్గొన్నారు.

'దేవాలయాలపై దాడులు చేస్తే సహించం'

ఉట్నూరు గ్రామీణం, న్యూస్‌టుడే: హిందూవులతోపాటు హిందూ దేవాలయాలపై దాడులు చేస్తే సహించేది లేదని భాజపా నాయకులు రితేష్ రాథోడ్ అన్నారు. సోమవారం ఉట్నూరు నల్లపోచమ్మ ఆలయ ప్రాంగణంలో హిందూ సంఘాల ఆధ్వర్యంలో నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. హైదరాబాద్‌లోని ముత్యాల పోచమ్మ విగ్రహాన్ని ధ్వంసం చేసిన నిందితుని ఉరితీయాలని డిమాండ్ చేశారు. అనంతరం సీఐ మొగిలికి వినతిపత్రం ఇచ్చారు. నాయకులు గుగ్గిలావత్ శ్రీరాం నాయక్, సట్ల అశోక్, లింగాగౌడ్, ఆడే ధన్‌లాల్ తదితరులు పాల్గొన్నారు.

భారాస నేతలపై కేసు సరికాదు

ఆదిలాబాద్ పట్టణం, న్యూస్‌టుడే: రిమ్స్‌లో మాజీ మంత్రి కేటీఆర్‌పై, రైతు భరోసా ఇవ్వనందుకు సీఎం రేవంత్, మంత్రి తుమ్మల దిష్టిబొమ్మ దహనం చేసిన మాజీ మంత్రి జోగురామన్నతోపాటు మరికొందరిపై బేలలో పోలీసులు కేసు నమోదు చేయడం సరికాదని భారాస జిల్లా ఉపాధ్యక్షుడు ఇజ్జగిరి నారాయణ అన్నారు. ఆదిలాబాద్‌లో ఈ నెల 24న కేటీఆర్ సభ నేపథ్యంలో పట్టణంలోని పలు కాలనీల్లో సోమవారం ప్రచారం నిర్వహించారు. ఆటోలకు పోస్టర్లను అతికించారు. భారాస నాయకులు రాజ్ సిద్ధార్థ, అనిల్, కార్తిక్, అరవింద్, అఖిల్ తదితరులు పాల్గొన్నారు.

రిమ్స్ సమస్యలపై సమీక్ష

ఆదిలాబాద్ వైద్య విభాగం, న్యూస్‌టుడే: రిమ్స్‌లో నెలకొన్న సమస్యలపై రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ సోమవారం సమీక్షించారు. హైదరాబాద్‌లోని తన కార్యాలయంలో ఉస్మానియా, గాంధీ, కేఎంసీ, ఆదిలాబాద్ రిమ్స్ ప్రిన్సిపాళ్లు, సంచాలకులతో సమావేశం నిర్వహించారు. రిమ్స్‌లో నెలకొన్న సమస్యలను సంచాలకుడు డాక్టర్ రాథోడ్ జైసింగ్ మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. సమస్యలన్నీ రాత పూర్వకంగా నివేదిస్తే వాటి పరిష్కారానికి కృషి చేస్తానని మంత్రి హామీ ఇచ్చినట్లు సంచాలకుడు తెలిపారు.

మిత్రుడి కుటుంబానికి ఆర్థికసాయం

సోనాల(బోథ్), న్యూస్‌టుడే: బోథ్ మండలం గుర్రాలతండాకు చెందిన చౌహాన్ జవహర్‌సింగ్ ఇటీవల మృతి చెందారు. ఈ విషయాన్ని సోనాల జిల్లా పరిషత్ పాఠశాలలో 1991-92 పదో తరగతి చదివిన ఆతడి బ్యాచ్ మిత్రులు తెలుసుకున్నారు. సోమవారం బాధిత కుటుంబ సభ్యులను మిత్రబృందం రూ.50 వేల ఆర్థికసాయం అందించారు.


గుర్రాలతండాలో బాధిత కుటుంబ సభ్యులతో 1991-92 బ్యాచ్ మిత్రులు

రూ.33 లక్షల భవనం.. నిధుల్లేక నిరుపయోగం

ఆదిలాబాద్ నేర విభాగం, న్యూస్‌టుడే : పట్టణంలోని ఎక్సైజ్ సూపరింటెండెంట్ కార్యాలయం వెనుక సంజయ్‌నగర్‌లో రూ.33 లక్షల అంచనా వ్యయంతో నిర్మించిన ఆబ్కారీ ఎస్‌హెచ్‌ఓ(స్టేషన్ హౌజ్ ఆఫీసర్) కార్యాలయ భవనం నిరుపయోగంగా మారింది. 2017లో ఈ భవన నిర్మాణానికి నిధులు మంజూరుకాగా రూ.28 లక్షలు వ్యయం చేసి నిర్మాణ పనులను పోలీసు హౌజింగ్ బోర్డు ఇంజినీరింగ్ విభాగం అధికారులు పూర్తి చేశారు. మిగతా నిధులు విడుదల కాకపోవటంతో ఆ భవనంలో విద్యుద్దీకరణ, నీటి సరఫరా పనులను చేపట్టలేదు. ఖాళీ భవనంలో అసాంఘిక కార్యకలాపాలు కొనసాగుతున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. ప్రస్తుతం ఎస్‌హెచ్‌ఓ కార్యాలయాన్ని కైలాస్‌నగర్‌లో శిథిల భవనంలో నిర్వహిస్తున్నారు. ఈ విషయమై ఆ శాఖ డిప్యూటీ ఈఈ ఆశీర్వాదంను సంప్రదించగా నిధులు పూర్తి స్థాయిలో విడుదల కాకపోవటంతో మిగతా పనులు చేపట్టలేదన్నారు.



ప్రతిభ చాటి.. బహుమతులు గెలిచి


పరీక్ష రాస్తున్న విద్యార్థులు


విజేతలకు బహుమతులు ఇస్తున్న ప్రిన్సిపల్ సచ్చింద్రనాథ్

పాలనాప్రాంగణం, న్యూస్‌టుడే: జిల్లా కేంద్రంలోని శ్రీబాలాజీ విద్యా మందిర్‌లో సోమవారం 'ఈనాడు' ఆధ్వర్యంలో ప్రతిభా పాటవ పోటీలు నిర్వహించారు. 'ఇంటర్నెట్ వినియోగం- విద్యార్థులపై సోషల్ మీడియా ప్రభావం' అంశంపై వ్యాసరచన పోటీలు చేపట్టారు. ఈ పోటీల్లో 8, 9, 10 తరగతుల విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఇందులో పదోతరగతి విద్యార్థులు ఎల్.సుధీక్ష(ప్రథమ), షేక్ మజీద్(ద్వితీయ), ఎస్.వంశిక తృతీయ స్థానంలో నిలిచి ప్రతిభ చాటారు. విజేతలకు పాఠశాల ప్రిన్సిపల్ సచ్చింద్రనాథ్ బహుమతులు, ప్రశంసాపత్రాలు ప్రదానం చేశారు.

అర్జీదారుల గోస.. పరిష్కారానికి భరోసా

పాలనాప్రాంగణం, న్యూస్‌టుడే: ప్రజావాణి విభాగానికి సోమవారం అర్జీదారులు భారీగా తరలివచ్చారు. పాలనాధికారి రాజర్షిషాకు ఆయా సమస్యలపై అర్జీలు నివేదించగా.. వాటి పరిష్కారానికి తగు చర్యలు తీసుకుంటామని ఆయన భరోసా ఇచ్చారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వారు 93 అర్జీలు సమర్పించారు.

పింఛన్లకు ఎదురుచూపు



ఏ ఆధారంలేని తమకు పింఛన్లు ఇవ్వాలని నేరడిగొండ మండలం కుంటాలకు చెందిన వితంతువులు విన్నవించారు. ప్రజాపాలనతోపాటు మీసేవలో దరఖాస్తు చేసుకుని ఎదురు చూస్తున్నామన్నారు. కొత్త పింఛన్ల మంజూరుకు ప్రభుత్వ అనుమతి రావాల్సి ఉందని అధికారులు సమాధానమిచ్చారు.

ఆక్రమణలు తొలగించరూ

రోడ్డును ఆక్రమించుకుని షెడ్డు వేసుకున్న ఇంటి యజమానిపై చర్యలు తీసుకోవాలని ఆదిలాబాద్ పట్టణం టీచర్స్‌కాలనీ వాసి కౌటిక్ కిషన్ ఫిర్యాదు చేశారు. ఈ విషయమై మున్సిపల్ అధికారులు షోకాజ్ నోటీసులు ఇచ్చి చేతులు దులుపుకొన్నారని, తగు చర్యలు తీసుకోవాలని బల్దియా కమిషనర్‌ను కోరారు.

రోడ్డు లేక అవస్థలు



రోడ్డు లేక అవస్థలు పడుతున్నామని భీంపూర్ మండలం భగవాన్‌పూర్ గ్రామస్థులు వాపోయారు. ఎమ్మెల్యే గ్రావెల్ రోడ్డుకు నిధులు మంజూరు చేసినా పనుల కొనసాగింపునకు అటవీ అధికారులు అడ్డుకుంటున్నారని పాలనాధికారికి వివరించారు.

ఆ భూములు తిరిగి ఇవ్వాలి

సిమెంటు ఫ్యాక్టరీ, సోలార్ యూనిటు ఏర్పాటు చేస్తానని మాయమాటలు చెప్పి గతంలో ఒకరు దళితుల నుంచి కారుచౌకగా భూములు కొనుగోలు చేశారని జైనథ్ మండలం కాన్పమేడిగూడకు చెందిన రైతు క్యాతం శివప్రసాద్‌రెడ్డి పాలనాధికారికి ఫిర్యాదు చేశారు. ఆ పట్టాలను రద్దు చేసి దళితులకు తిరిగి ఆ భూములు ఇప్పించాలని కోరారు.

అటవీ అనుమతి ఇప్పించండి



గ్రామ పంచాయతీ భవన నిర్మాణానికి నిధులు మంజూరైనా ఆ భవనం కట్టేందుకు అటవీ అధికారులు అనుమతి ఇవ్వడం లేదని బేల మండలం గణేష్‌పూర్ గ్రామస్థులు పేర్కొన్నారు. అధికారులతో మాట్లాడి అనుమతి లభించేలా చూస్తానని పాలనాధికారి భరోసా ఇచ్చారు.

ఎంపీకి శుభాకాంక్షల వెల్లువ


ఎంపీ నగేష్‌కి జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతున్న ఎమ్మెల్యే పాయల్ శంకర్, భాజపా శ్రేణులు

పాలనాప్రాంగణం, న్యూస్‌టుడే: ఆదిలాబాద్ ఎంపీ గోడం నగేష్‌కు జన్మదిన వేళ సోమవారం శుభాకాంక్షలు వెలువెత్తాయి. ఉదయం పట్టణంలోకి వేంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. కేంద్రమంత్రులు అమిత్‌షా, రాజ్‌నాథ్‌సింగ్‌లు వేర్వేరుగా ఫోన్ చేసి పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు. మహారాష్ట్ర ఎన్నికల ప్రచారంలో చురుగ్గా పాల్గొనాలని సూచించారు. ఆ తర్వాత ఎమ్మెల్యే పాయల్ శంకర్ పార్టీ శ్రేణులతో కలిసి ఇంటికి వెళ్లి ఎంపీని శాలువాతో సన్మానించి పుష్పగుచ్ఛం అందించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఆదిలాబాద్ పట్టణంతోపాటు భీంపూర్, తాంసి, తలమడుగు మండలాల నుంచి వచ్చిన పార్టీ శ్రేణులతో ఉదయం నుంచి ఎంపీ నివాసం సందడిగా మారింది. జడ్పీటీసీల ఫోరం మాజీ అధ్యక్షుడు తాటిపెల్లి రాజు, పట్టణాధ్యక్షులు లాలామున్నా తదితరులు ఎంపీని కలిసి సన్మానించిన వారిలో ఉన్నారు.

ఇంద్రవెల్లి, బజార్‌హత్నూర్, తలమడుగు : ఎంపీ గోడం నగేష్ జన్మదినం సందర్భంగా మాజీ జడ్పీటీసీ సభ్యురాలు పుష్పలత ఆధ్వర్యంలో భాజపా నాయకులు స్థానిక పీహెచ్‌సీలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. బజార్‌హత్నూర్ మండలం జాతర్లలోని రాయసెంటర్‌లో నవజ్యోతి యూత్‌క్లబ్ ఆధ్వర్యంలో, బజార్‌హత్నూర్‌లోని తిరుమల గార్డెన్‌లో భాజపా నాయకులు ఎంపీ జన్మదిన వేడుకలను నిర్వహించారు. పట్టణంలోని తన నివాసంలో తలమడుగు భాజపా నాయకులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు బ్రహ్మానంద్, నాయకులు శ్రీనివాస్, చంద్రకాంత్, వెంకటస్వామి, ప్రభాకర్, నారాయణరెడ్డి, కిరణ్, శ్రీనివాస్‌రెడ్డి, మహేందర్‌యాదవ్ పాల్గొన్నారు.


తలమడుగు: ఎంపీకి శుభాకాంక్షలు తెలుపుతున్న తలమడుగు భాజపా నేతలు

జాతీయస్థాయి క్రీడల్లో రాణించడం అభినందనీయం

ఉట్నూరు గ్రామీణం, న్యూస్‌టుడే : గిరిజన ఆశ్రమ పాఠశాల, కళాశాలల్లోని విద్యార్థులు క్రీడల్లో రాణించేలా ఐటీడీఏ అన్ని రకాల సౌకర్యాలు కల్పిస్తుందని ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా అన్నారు. సోమవారం విద్యార్థులను అభినందించారు. జార్ఖండ్‌లో నిర్వహించిన జాతీయస్థాయి సబ్ జూనియర్ ఖోఖోలో రజత పతకం సాధించిన సిడాం శంకర్, పెందూర్ హన్మంత్, ఆత్రం యాదవ్‌రావు, రాథోడ్ శివ, మేస్రం నిఖిల్, ఆత్రం శివచరణ్, గుంటూరులో నిర్వహించిన జాతీయస్థాయి జూనియర్ అథ్లెటిక్స్ పోటీల్లో బంగారు పతకం సాధించిన రాథోడ్ కార్తిక్‌లను అభినందించారు. ఏసీఎం జగన్, జిల్లా గిరిజన క్రీడల అధికారి పార్థసారథి, హెచ్‌ఎం ఉత్తం, పీడీలు పాల్గొన్నారు.

జిల్లాకు 21 మంది సివిల్ సర్వీసు శిక్షణార్థులు

పాలనాప్రాంగణం, న్యూస్‌టుడే: జిల్లాలో క్షేత్రస్థాయి పర్యటనకుగాను సోమవారం 21 మంది సివిల్ సర్వీసు శిక్షణార్థులు సోమవారం జిల్లాకు చేరుకున్నారు. బేల మండలం సిర్సన్న, తాంసి మండలం పొన్నారి, జైనథ్ మండలం పెండల్‌వాడ, ఆదిలాబాద్ గ్రామీణ మండలం లోకారి గ్రామాల్లో బృందాలుగా పర్యటించనున్నారు. ఈ మేరకు పాలనాధికారి రాజర్షిషా, ఎస్పీ గౌష్‌ఆలం వారితో కలెక్టరేట్‌లో సమావేశమయ్యారు. జిల్లాలో అమలవుతున్న పథకాలు, సంక్షేమ కార్యక్రమాల గురించి శాఖలవారీగా వివరించారు. ఈ నెల 28 వరకు ఆయా గ్రామాలతోపాటు మున్సిపల్‌వార్డుల్లో పర్యటిస్తారని పాలనాధికారి తెలిపారు. శిక్షణ పూర్తయ్యాక తాము గమనించిన అంశాలను పాలనాధికారికి నివేదించనున్నారు.


ఆదిలాబాద్ : అమరుల స్తూపం వద్ద నివాళులు అర్పిస్తున్న వారి కుటుంబ సభ్యులు


ఇంద్రవెల్లి మండల కేంద్రంలో..


ఉట్నూరులో పోలీసు అమర వీరుల స్తూపం వద్ద..

పోలీసుల సేవలు వెలకట్టలేనివి


బోథ్‌లో నివాళులు అర్పిస్తున్న పోలీసులు, పాఠశాల విద్యార్థులు

ఇంద్రవెల్లి, బోథ్, ఉట్నూరు గ్రామీణం, ఆదిలాబాద్ నేరవిభాగం, న్యూస్‌టుడే: జిల్లావ్యాప్తంగా పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని సోమవారం నిర్వహించారు. శాంతిభద్రతల పరిరక్షణకు తమ ప్రాణాలను తృణప్రాయంగా భావిస్తూ విధులు నిర్వర్తిస్తున్న పోలీసుల సేవలు వెలకట్టలేనివని జిల్లా పాలనాధికారి రాజర్షిషా పేర్కొన్నారు. ఏఆర్ హెడ్‌క్వార్టర్‌లో ఎస్పీ గౌష్ ఆలం ఆధ్వర్యంలో ఫ్లాగ్‌డే నిర్వహించారు. ముఖ్య అతిథిగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి ప్రభాకర్ రావు, విశిష్ఠ అతిథులుగా ఎమ్మెల్యేలు పాయల్ శంకర్, అనిల్ జాదవ్, అతిథిగా జిల్లా పాలనాధికారి రాజర్షిషా, రెండో బెటాలియన్ కమాండెంట్ నితికా పంత్ పాల్గొన్నారు. అమరుల స్తూపం వద్ద పోలీసు అమర వీరుల కుటుంబ సభ్యులతో కలిసి శ్రద్ధాంజలి ఘటించి నివాళులు అర్పించారు. దేశ రక్షణలో ప్రాణాలను త్యాగం చేసిన 214 మంది పోలీసు సిబ్బంది పేర్లను అదనపు ఎస్పీ బి.సురేందర్‌రావు చదివి స్మరించుకున్నారు. స్తూపం వద్ద జ్యోతి ప్రజ్వలన చేసి శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం కుమురంభీం చౌరస్తా వరకు నిర్వహించిన ర్యాలీని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, రెండో బెటాలియన్ కమాండెంట్ జెండా ఊపి ప్రారంభించారు.


ఆదిలాబాద్ : అమరుల స్తూపం వద్ద నివాళులు అర్పిస్తున్న మాల సంఘం నాయకులు


ఆదిలాబాద్‌లో సనాతన హిందూ ఉత్సవ సమితి నాయకులు

భక్తిశ్రద్ధలతో బతుకమ్మ సంబురాలు


భీంపూర్ మండలంలో..

బేల, న్యూస్‌టుడే: బేల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఆదివారం రాత్రి భజరంగ్‌దళ్ మండల కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించి సామూహిక బతుకమ్మ సంబురాలు ఆకట్టుకున్నాయి. 8 జట్లు పోటాపోటీ ప్రదర్శనలతో అలరించాయి. విజేతగా జైమాతాజీ జట్టు నిలువగా రెండో విజేతగా సర్వజనికి హనుమాన్ జట్టు, మూడో విజేతగా వైష్ణవి జట్టు నిలిచింది. వీరికి నగదు బహుమతులను ప్రదానం చేశారు. భజరంగ్‌దళ్ జిల్లా అధ్యక్షుడు బండారి సంతోష్, మండల అధ్యక్షుడు అగార్కర్ ఆకాష్, ప్రీతం, విశ్వహిందూ పరిషత్ జిల్లా ఉపాధ్యక్షుడు శర్మాజీ పాల్గొన్నారు.

భీంపూర్: మండలంలో సోమవారంతో బతుకమ్మ సంబరాలు ముగిశాయి. పిప్పల్‌కోటి, కరంజి-టి, అర్లి-టి తదితర గ్రామాల్లో బతుకమ్మలకు వీడ్కోలు పలుకుతూ పెన్‌గంగా నది, వాగుల్లో నిమజ్జనం చేశారు.

తాంసి: తాంసి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సోమవారం తెలంగాణ బతుకమ్మ సంబరాలు నిర్వహించారు. పాటలు పాడుతూ కోలాటమాడారు. సాయంత్రం శోభాయాత్ర నిర్వహించి తాంసి వాగులో బతుకమ్మలను నిమజ్జనం చేశారు.


తాంసి : బతుకమ్మలతో తాంసి కళాశాల విద్యార్థినులు, మహిళా అధ్యాపకులు

సంక్షిప్త సమాచారం

మున్నూరుకాపు జిల్లా కార్యవర్గం రద్దు

ఆదిలాబాద్ అర్బన్: మున్నూరుకాపు జిల్లా కార్యవర్గంతోపాటు రైతువిభాగం రద్దయినట్లు ఆ సంఘం తాలుకా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కాళ్ల విఠల్, కలాల శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. 15 రోజుల్లో కొత్త కార్యవర్గాన్ని ఎన్నుకోనున్నట్లు పేర్కొన్నారు.

రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నరేష్

ఆదిలాబాద్‌అర్బన్: తెలంగాణ చేనేత ఐక్య వేదిక యువజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా జిల్లాకు చెందిన కుర్ర నరేష్ నియమితులయ్యారు. ఈ మేరకు ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు రాపోలు వీర మోహన్ ఉత్తర్వులు జారీ చేశారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

గుడిహత్నూర్: మండలంలోని మన్నూర్‌కి చెందిన ఆర్టీసీ డ్రైవర్ ముండే నవనీత్ ఇటీవల మృతి చెందడంతో బాధిత కుటుంబాన్ని సోమవారం ఎమ్మెల్యే అనిల్ జాదవ్ పరామర్శించారు. ఇచ్చోడ మార్కెట్ కమిటీ మాజీ ఛైర్మన్ తిరుమల్‌గౌడ్, నాయకులు ఉన్నారు.

తలమడుగు పశువైద్యాధికారిగా లావణ్య

తలమడుగు: మండల పశువైద్యాధికారిగా లావణ్య సోమవారం బాధ్యతలు చేపట్టారు. మాజీ జడ్పీటీసీ సభ్యుడు గోక గణేష్‌రెడ్డి, తహసీల్దార్ రాజ్‌మోహన్, మండల విద్యాధికారి వెంకట్‌రావులు ఆమెను అభినందించారు. ఇన్నాళ్లు ఇక్కడే పని చేసిన దూద్‌రామ్ రాథోడ్ ఆదిలాబాద్‌కు బదిలీపై వెళ్తుండటంతో ఆయనను సత్కరించారు.

కళాశాల సందర్శన

ఇచ్చోడ: ఇచ్చోడలోని బాలికల గిరిజన గురుకుల పాఠశాల, కళాశాలను హ్యూమన్ రైట్స్ ఫౌండేషన్ కమిటీ సభ్యులు సోమవారం సందర్శించారు. 2013లో కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన వేధింపుల నిరోధక చట్టం కమిటీ ఏర్పాటు చేయాలని వివరించారు. వ్యవస్థాపక జాతీయ అధ్యక్షులు దాసు, జిల్లా అధ్యక్షులు రమణ, రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు ప్రసన్న కుమారి, సభ్యులు ఉన్నారు.



విద్యుత్తు స్తంభంపై మంటలు

పట్టణంలోని రాంపూర్ రోడ్డులో సీసీఐ గోదాం సమీపంలో విద్యుత్తు స్తంభంపై ఏర్పాటు చేసి టీవీ డిష్ తీగల బాక్సులో సోమవారం విద్యుదాఘాతం ఏర్పడింది. ఒకేసారి మంటలు ఎగిసిపడటంతో స్థానికులు భయబ్రాంతులకు గురయ్యారు. - **ఈనాడు, ఆదిలాబాద్, న్యూస్‌టుడే, ఆదిలాబాద్ నేర విభాగం**

అభివృద్ధి పనులకు భూమిపూజ

బజార్‌హత్నూర్: మండలంలోని పిప్పిరి గ్రామంలో సోమవారం అభివృద్ధి పనులకు కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌ఛార్జి ఆడె గజేందర్ భూమిపూజ చేశారు. ఎస్డీఎఫ్ పథకం కింద రూ.5 లక్షల నిధులతో ఇందిరమ్మ కాలనీలో సీసీ రోడ్డు నిర్మాణ పనులను కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

ఆదిలాబాద్ అర్బన్: పంచాయతీ కార్యదర్శుల జిల్లా ఫోరం కార్యవర్గ ఎన్నికలు సోమవారం జిల్లా కేంద్రంలోని టీఎన్‌జీఓ భవనంలో నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడిగా జొనపల్లి సంజీవ్‌రావు, కార్యదర్శిగా బొర్లకుంట దుర్గయ్య, సహాయ అధ్యక్షులుగా వి.సూర్యప్రకాశ్, ఖదీర్ అహ్మద్, రాఖీ, సంయుక్త కార్యదర్శిగా చిక్కల గంగన్న, బి.మల్లేష్, నర్సారెడ్డి, నసీమ, కోశాధికారిగా ఇజ్జగిరి రాందాస్, కార్యనిర్వాహక కార్యదర్శిగా జి.సత్యనారాయణ, రౌతు దేవేందర్, సభ్యులను ఎన్నుకున్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం షురూ

పాలనాప్రాంగణం: ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో తమ సంఘం అభ్యర్థి వంగ మహేందర్‌రెడ్డిని బలపర్చాలని పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు కొమ్ము కృష్ణకుమార్ అన్నారు. ఆదిలాబాద్ పట్టణంలోని పలు పాఠశాలల్లో ఉపాధ్యాయులను కలిసి సోమవారం ప్రచారం చేశారు.

కార్యకర్త భౌతికకాయంపై కాషాయ జెండా

జైనథ్: మండలంలోని లక్ష్మీపూర్‌కి చెందిన భాజపా కార్యకర్త ఉడం గణపతి సోమవారం మృతి చెందాడు. ఆయన అంత్యక్రియలకు హాజరైన ఎమ్మెల్యే పాయల్ శంకర్ ఆయన భౌతికకాయంపై కాషాయ జెండాను కప్పి నివాళులు అర్పించారు.

'జీ.వో నం 29 రద్దు చేయాలి'

ఉట్నూరు గ్రామీణం: రాష్ట్ర ప్రభుత్వం గ్రూప్-1 ఉద్యోగాల నియామకాల్లో ప్రవేశపెట్టిన జీవో నం 29ని రద్దు చేయాలని డీటీఎఫ్ రాష్ట్ర ప్రతినిధి ముగుడు శామ్యూల్ డిమాండ్ చేశారు. సోమవారం ఉట్నూరులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈ జీవోతో ఎస్సీ, ఎస్టీ, బీసీలకు అన్యాయం జరుగుతుందన్నారు. ఈ జీవో రద్దు చేసి జీవో నం 59 ప్రకారం ఉద్యోగ నియామకాలు చేపట్టి నిరుద్యోగులకు న్యాయం చేయాలని కోరారు. డీటీఎఫ్ ఉపాధ్యాయ సంఘం నాయకులు రాథోడ్ ఉపేందర్, బండి రాజారాం, రవిత, రాధ తదితరులు పాల్గొన్నారు.